క్లుప్తంగా

కంటి ఆపరేషన్లకు 76 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాముల గుడి వీధిలోని జైన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి 120 మంది వచ్చారు. వీరికి పరీక్షలు చేయగా ఆపరేషన్‌కు 76 మంది ఎంపికయ్యారు. వీరికి ఉచితంగా ఆపరేషన్, వసతి కూడా కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

చవితి పండగలో అల్లర్లు వద్దు


మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వినాయక చవితి పండుగలో అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ సాయినాథ్ సూచించారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం గణేష్ ఉత్సవ సమితి చవితి నిర్వాహకులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నంచి జరిగే చవితి వేడుకలు ఆయా ప్రాంతాల్లో ప్రశాంతంగా జరగాలన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామిని కొలవాలన్నారు. పండగ పేరుతో అల్లర్లు, గొడవలు వద్దన్నారు. హద్దు మీరితే చర్యలు ఉంటాయన్నారు. కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని ఆయన తెలిపారు.

ఐరాల మండలం పేరు ముద్రించరా ?

ఐరాల: శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లపై ఐరాల మండలం పేరు ముద్రించకపోవడం శోచనీయమని భారతీయ జనతా పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అయిరాల రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఈ నెల 27వ తేదీ నుంచి కాణిపాకం ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మండలం పేరు ముద్రించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గత పదేళ్ల కిందట దేవస్థానం అధికారులు ఇలాగే మండలం పేరు ముద్రించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టి పేరు ముద్రించేలా చేశామన్నారు. మళ్లీ ఈ సంవత్సరం వాల్‌పోస్టర్లపై మండలం పేరు లేకుండా ముద్రించారని, అందుకు కారకులైన వారిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోటీతత్వం ముఖ్యం


శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి విద్యార్థిలో పోటీతత్వం ముఖ్యంగా ఉండాలని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోటీతత్వం, సృజనాత్మకత అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే పోటీతత్వాన్ని అలవరచుకోవాలన్నారు. గత ఆరు రోజులుగా తమ కళాశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ సంస్థలు సంయుక్తంగా ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇప్పించారన్నారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించేందుకు కావాల్సిన మౌఖిక నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, సాఫ్ట్‌స్కిల్స్ ప్రదర్శన నైపుణ్యం, ఉద్యోగ నిర్వహణ నైపుణ్యం వంటివాటిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారని తెలిపారు.

ధ్వజ స్తంభ దారువుకు పూజలు


దారువుకు పూజలు చేస్తున్న మహిళలు

పలమనేరు : పట్టణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నూతన గాలిగోపురం, ధ్వజస్తంభం నిర్మాణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా కేరళ అడవుల నుంచి ఇక్కడికి ధ్వజ స్తంభానికి కావాల్సిన పెద్ద దారువును కంటైనర్‌లో ఆదివారం తీసుకువచ్చారు. ఆ వాహనానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు విశేషంగా అలంకరించి ఊరేగించారు. మరోవైపు పట్టణంలోని ఓంశక్తి భక్తులు పసుపు చీరలు ధరించి పసుపు నీటితో దారువుకు అభిషేకం, అనంతరం క్షీరాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


కేరళ నుంచి వచ్చిన వాహనానికి పూజలు చేస్తున్న భక్తులు

చదివారు..సాధించారు

నెలలు, సంవత్సరాల తరబడి పుస్తకాలతో కుస్తీ పట్టి .. కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి.. లక్ష్య సాధన కోసం కుటుంబాలకు దూరంగా ఉండి.. చివరికి విజయం సాధించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వేలాది మంది పేదింటి నిరుద్యోగులు ఉపాధ్యాయ కొలువుల కోసం శిక్షణ పొందారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో పోస్టు సాధించిన జాబితాలో వారి పేరు ఉండడం చూసి మనసారా టీచరు అని పిలుపించుకునేందుకు సిద్ధమయ్యారు.

- ఏళ్ల తరబడి పుస్తకాలతో కుస్తీ పట్టిన అభ్యర్థులు
- కుటుంబాలను వదిలి శిక్షణా కేంద్రాల్లోనే..
- విపత్కర పరిస్థితులను అధిగమించి..
- టీచర్ కల నెరవేర్చుకున్న అభ్యర్థులు
- డీఎస్సీ పరీక్షల్లో రాణించిన పేదింటి ఆణిముత్యాలు
- నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారే అధికం



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు మెగా డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించి తాము ప్రభుత్వ టీచర్ కావాలన్న కలను సాధించుకున్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ శిక్షణా కేంద్రాలతో పుస్తకాలతో కుస్తీ పడ్డారు. పేదరికం జయించాలంటే.. అవమానాలు అధిగమించాలంటే ప్రభుత్వ కొలువుతోనే సాధ్యమని భావించారు. ఎన్ని అడ్డంకులు, అవమానాలు ఎదురైనా, వయసు పూర్తవుతున్నా.. పట్టువదలకుండా డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చి కొలువు సాధించిన వారి మనోగతంపై సాక్షి ప్రత్యేక కథనం

ప్రశాంతంగా సాధించాడు..



నాది అనంతపురం జిల్లా గుత్తి మండలం ఎర్రగుడి గ్రామం . ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే ఆశయంతో చిత్తూరులోని మిట్టూరులో ఉన్న ఓ శిక్షణా కేంద్రంలో సంవత్సరాల కొద్దీ శిక్షణ పొందాను. చాలా ఏళ్ల తర్వాత నా ఆశయం నెరవేరింది. మెగా డీఎస్సీలో నాకు 82.48 మార్కులు వచ్చాయి. నా తల్లిదండ్రులు నా మీద పెట్టిన నమ్మకం నేటితో నెరవేరింది. కూలీ పనులు చేస్తూ నన్ను చదివించారు. పేదరికం నుంచి బయటపడాలంటే అది కేవలం విద్యతోనే సాధ్యపడుతుంది. **- తల్లిదండ్రులతో డీఎస్సీ అభ్యర్థి మోట ప్రశాంత్**

మారుమూల పల్లె నుంచి వచ్చి..



నాది చిత్తూరులోని కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలోని మారుమూల గ్రామం పెద్దకురబలపల్లె. మెగా డీఎస్సీ ఫలితాల్లో 86.36 మార్కులతో టీచర్ కొలువు సాధించాను. ఇంతటి గొప్ప విజయం సాధించడానికి గల కారణం నా తల్లిదండ్రుల శ్రమ. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందాను. ఉచిత శిక్షణలో ప్రణాళిక ప్రకారం చదివి టీచరు పోస్టు సాధించాను.

- తల్లిదండ్రులతో డీఎస్సీ అభ్యర్థి రమేష్

ఒకేసారి మూడు ఉద్యోగాలకు సుజాత..



మాది జిల్లాలోని పెనుమూరు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో చాలా ఏళ్లుగా డీఎస్సీ పరీక్షకు సన్నద్ధం అవుతున్నాను. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కోవడం జరిగింది. అయినా నా ఆశయాన్ని వదులుకోలేదు. ప్రస్తుతం డీఎస్సీ ఫలితాల్లో ఒకేసారి మూడు పోస్టులకు ఎంపికవ్వడం సంతోషంగా ఉంది. నా భర్త జానకిరామరెడ్డి ప్రోత్సాహంతో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్‌ఏ తెలుగులో 85.29, టీజీటీలో 76.86, పీజీటీలో 78 మార్కులు సాధించాను.

- పెనుమూరుకు చెందిన డీఎస్సీ అభ్యర్థి సుజాత

2018 నుంచి శిక్షణ పొంది..



మాది అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం నాయునివారిపల్లి. మా తండ్రి తలారి నంజుండప్ప, తల్లి లక్ష్మీదేవమ్మ గొర్రెలను మేపుకుంటూ వ్యవసాయం చేస్తుంటారు. చిన్నతనం నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే విద్యనభ్యసించాను. ప్రస్తుతం ఎస్‌ఏ బయాలజీలో 7వ ర్యాంక్ సాధించాను. నేను ఈ పోస్టు కోసం 2018వ సంవత్సరం నుంచి చదువుతున్నాను. మొదట సచివాలయ ఉద్యోగం సాధించాను. చిన్నప్పటి నుంచి టీచర్ అవ్వాలన్నది నా కోరిక. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో సెలవు పెట్టి పరీక్షకు శిక్షణ పొంది నా చిన్ననాటి కల సాకారం చేసుకున్నాను. **- తల్లిదండ్రులతో డీఎస్సీ అభ్యర్థి నరేంద్ర**

లక్ష్యం సాధించిన భార్గవుడు



మాది జిల్లాలోని పుంగనూరు మండలం గుడిసిబండ గ్రామం. ప్రస్తుతం డీఎస్సీలో 80.08 మార్కులు సాధించడం జరిగింది. నాన్న అకాల మరణం చెందారు. అప్పటి నుంచి నా కష్టనష్టాలన్నీ అమ్మ, అన్నయ్యలే. నాలో ఉన్న ప్రతిభను గుర్తించి ఈ మార్గాన్ని చూపించింది అమ్మ, అన్న, వదినలే. చిన్నవాడైనా కుటుంబ బాధ్యతలు మోస్తూ తనను శిక్షణకు పంపిన తమ్ముడు మేలు మరువలేను. సంవత్సరాల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉన్నా. నన్ను ప్రోత్సహించిన నా కుటుంబానికి ఈ పోస్టు అంకితం చేస్తున్నాను.

- కుటుంబ సభ్యులతో డీఎస్సీ అభ్యర్థి భార్గవ

ఉషస్సులా మెరిసి..



మాది జిల్లాలోని పలమనేరు. ఒక వైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే సంవత్సరాల తరబడి డీఎస్సీ శిక్షణ పొందాను. గతంలో డీఎస్సీ పరీక్ష రాశాను. ఆ సమయంలో పలు కారణాలతో అర్హత పొందలేకపోయాను. నిరాశ చెందకుండా తన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాను. నా శిక్షణకు భర్త ఎంతో ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సాహంతోనే నేడు డీఎస్సీలో అర్హత పొందాను. ప్రస్తుతం ఎస్‌ఏ బయాలజీలో 11వ ర్యాంక్ సాధించి ప్రభుత్వ టీచర్ కలను నెరవేర్చుకున్నాను.

- కుటుంబ సభ్యులతో డీఎస్సీ అభ్యర్థిని ఉషా

తండ్రి ప్రోత్సాహంతో..



మాది అన్నమయ్య జిల్లా కలకడ మండలం. నా తండ్రి రిటైర్డ్ టీచర్ కావడంతో చిన్నతనం నుంచి నాలో టీచర్ అవ్వాలనే కోరిక ఏర్పడింది. శిక్షణ పొందేందుకు కుటుంబ సభ్యులంతా ప్రోత్సహించారు. తండ్రి సూచనలతో శిక్షణ పొందాను. టీచర్ కావాలనే కోరిక ఇన్నేళ్లకు నెరవేరింది. పలుమార్లు నిరాశ చెందినప్పటికీ ఓడిపోకూడదనే కసితో చదివాను. ప్రణాళికతో చదవడం వల్లే ఈ ఉద్యోగం లభించింది. నేను ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరాక మనసా వాచకర్మణతో పనిచేస్తూ పేద విద్యార్థుల ఉన్నతికి దోహదం చేస్తాను.

- భర్తతో ఉర్దూ జిల్లా మొదటి ర్యాంక్ అభ్యర్థిని సబీహా రహ్మతునిస్స

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలోని ప్రజలు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు తప్పక హాజరుకావాలని వారు సూచించారు.

నేడు యూరియా పంపిణీ

గుడిపాల: మండలంలోని వసంతాపురం సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. సచివాలయానికి 300 బ్యాగులు వచ్చాయన్నారు. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ముస్తాబవుతున్న మండపాలు


వీఎస్ అగ్రహారంలో గణపతి గుడి వద్ద సిద్ధమవుతున్న మండపం

ఐరాల: మండలంలో వినాయక చవితి సందడి నెలకొంది. వాడవాడలా చవితి పందిళ్లు సిద్ధమవుతున్నాయి. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. చవితి ఉత్సవాలకు గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రంలోని వీఎస్ అగ్రహారం, బజారువీధి, అరుణానగర్ కాలనీ, వైఎస్ గేటు, వారపుసంత వద్ద ఉన్న గణపతి ఆలయం తదితర ప్రాంతాల్లో భారీ గణనాథుడి విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. పందిళ్ల అలంకరణ, విద్యుత్‌దీపాల ఏర్పాటు వంటి పనులు జరుగుతున్నాయి.

ప్రతి గడపకూ కూటమి మోసాలు


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

- చెర్లోపల్లిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత హామీలను గడపగడపకు తీసుకెళదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జయపాల్, జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, నాయకులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి పంచాయతీలో ఆదివారం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. తప్పుడు హామీలను కప్పి పుచ్చుకునేందుకు అరాచకాలు సృష్టిస్తోందని దుయ్యబట్టారు. సూపర్‌సిక్స్ అంటూ పూర్తిగా ప్రజలను మభ్యపెట్టిందన్నారు. తీరా ఆ పథకాల్లో కోతలు తప్ప మిగిలిందేమీ లేదన్నారు. దివ్యాంగులపై కక్ష సాధింపు ధోరణితో పింఛన్లను అడ్డగోలుగా తొలగించిందన్నారు. స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు అంటూ ఆంక్షలు పెట్టిందన్నారు. ఈ మోసపూరితమైన హామీలను ప్రతి గడపలోకి తీసుకెళ్దామన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయరాం, నాయకులు సంపత్, వాసు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌వేలు, పూర్ణ, పురుషోత్తం, హరి, జయకుమార్, శంకర్‌యాదవ్, కన్నన్ స్టాండ్లీ, భాస్కర్‌నాయుడు, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం సరళీకృతం చేయాలి


మాట్లాడుతున్న రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే మూల్యాంకనం సరళీకృతం చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే విద్యాశాఖ అమలు చేస్తున్న బోధనేతర పనులతో ఒత్తిడికి గురవుతున్న టీచర్లపై కూటమి సర్కారు పనిభారం పెంచుతోందన్నారు. అసెస్‌మెంట్ పుస్తకాలను అప్పజెప్పి మూల్యాంకనంపై పనిభారం పెంచడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వ వ్యవహార శైలిపై టీచర్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారన్నారు. ఈ పుస్తకాల వల్ల ప్రజాధనం దుర్వినియోగం తప్ప పేద విద్యార్థులకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ధైర్యం ఉంటే ఈ విధానాన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేయాలని ప్రశ్నించారు. ఈ విధానంతో విద్యార్థులు ఆగస్టు నెలలో బోధనకు పూర్తిగా దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసెస్‌మెంట్ పుస్తకాల విధానం అమలుతో కూటమి ప్రభుత్వం ప్రపంచ రికార్డు సాధించిందని ఎద్దేవా చేశారు. ఈ పరీక్షలు విద్యార్థుల కోసమా ? ఉపాధ్యాయుల కోసమా ? అనే సందిగ్ధత నెలకుందన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఒక టీచర్ కనీసం 600 పుస్తకాలను మూల్యాంకనం చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ విధానాన్ని సులభతరం చేయకపోతే రానున్న ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలు పూర్తిగా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు చెప్పారు.

జాగ్రత్తలు పాటించండి

బంగారుపాళెం: వినాయక చవితి ఉత్సవాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసు కోవాల్సిన అవసరం ఉందని ఏఈ దేవిప్రసన్న ఆదివారం తెలిపారు. మండపాల వద్దకు తీసుకొచ్చేటప్పుడు ఎత్తుగా ఉండే ప్రతిమలు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు బోటు చేసుకునే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలన్నారు.

ప్రశాంతంగా చవితి జరుపుకోండి

తవణంపల్లె: గ్రామాల్లో ప్రజలు వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎవరైనా గొడవలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు నిర్వాహకులు సహకరించాలని తెలిపారు.

చంద్రబాబు అంటే గుర్తుకొచ్చేది వెన్నుపోటే

- ఊకదంపుడు ప్రచారంతో మోసం చేయడమే ఆయన నైజం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి


ఎల్‌బీపురంలో క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చంద్రబాబు పేరు చెబితే అందరికీ గుర్తుకు వచ్చేది వెన్నుపోటేనని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని 11వ డివిజన్ ఎల్‌బీపురం నాయకులు అంజలి ప్రభాకర్‌రెడ్డి, శివ, సయ్యద్, 30వ డివిజన్ లాలూగార్డెన్‌లో నాయకులు చాపు, మున్సీరు, అంజాద్, ఆజాద్, అక్రమ్, మున్నా, 8వ డివిజన్ వెంగళరావుకాలనీలో కార్పొరేటర్ షర్మిల, నాయకులు టిమ్ము, ధన్‌రాజ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చంద్రబాబు ఇచ్చిన హామీల వీడియోలను ప్రదర్శించారు. ఉపన్యాసాలు, ప్రచారాలతో ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఆయన చేసిన తప్పుడు ప్రచారాలకు మద్దతు పలికిన మీడియా ఛానళ్లకు ఎన్నో లాభాలు, పదవులను అందించిన ఘనత చంద్రబాబునాయుడిదే అన్నారు. అయిన వారిని అందలాలు ఎక్కించిన ఆయన.. నిరుపేదలకు మాత్రం పిడికెడు సాయం అందించిన పాపాన పోలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయమే దండగ అన్న పెద్దమనిషి ఆయనేనన్నారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఎన్నో పథకాలను అందించారని చెప్పారు. వైద్యశాఖలో వేలాది పోస్టులను భర్తీ చేశారన్నారు. పాఠశాలలను ఆధునికీకరించడంతో పాటు, వైద్యవ్యవస్థను మరింత మెరుగు పరచి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించారని గుర్తు చేశారు. ఎన్నో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే సీఎం చంద్రబాబు ఉన్న వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఉద్యోగుల పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, నాయకులు నారాయణ, మధురెడ్డి, అను, నౌషద్, మనోజ్‌రెడ్డి, హరీషారెడ్డి, జబ్బా, నవాజ్, ఇమ్రాన్, సుదర్శన్, తులసి, మోహన్, చిట్టి, మురగ, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.


వెంగళరావుకాలనీలో ఎన్నికల హామీల ప్రదర్శన



వెంగళరావు కాలనీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి